మితవ్యయం

'ఈ యెర్రరిబ్బను గాలిపడగ తోకకి కడతాను. ఎంత ఎత్తైనా యెగరెయ్యొచ్చు యెంచక్కా. అమ్మయ్యో బాబోయ్. ఎంత రిబ్బను వుందో' అన్నాడు ఎనిమిదేళ్ళ శ్రీనివాసు.

'నాన్నెంత మంచివాడో. రోజూ మనం అరగజం అరగజం రిబ్బనుముక్కలు కొనుక్కోవడం చూసి యేకంగా ఓమూటే తెచ్చినట్లున్నాడు' అంది పెద్దపిల్ల సీత.

'నాకో పెద్దముక్క కోచివ్వవుటే అక్కా' అంది నాలుగేళ్ళ రమ.

'అంతా జడలోనే పెట్టుకోకూడదు. అంచులేని కంఠువాలకి పైట చెంగునా, జాకట్లకి చేతులదగ్గిరా కుట్టుకుంటే యీ రిబ్బను యెంతో బాగుంటుంది' అంది అక్కగారు.

'ఎన్ని తెచ్చినా మీకే చాలవు. రోజూ పరికిణీలకనీ, లాగులకనీ బొందుల కోసం చంపేస్తూంటారు. వేళకి యేదీ కనబడదు. నానా బాధగానూ వుంటోంది. ఈ రిబ్బను దళసరిగా బాగుంది బొందులకి. అంతా పాడుచెయ్యకండి' అంది తల్లి కమలాభాయి.

రమణారావు పి డబ్ల్యూ డి ఆఫీసులో డ్రాఫ్ట్స్‌మన్. జీతం 200 తెస్తున్నాడు. నలభై యేళ్లుంటాయి. మనిషి మంచివాడు. భార్య కమలాభాయి భర్త అడుగు జాడలలో మసులుకొనేది. వారికి అయిదుగురు సంతానం. ముగ్గురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. పెద్దపిల్లలు ముగ్గురూ స్కూల్లో చదువుతున్నారు. వచ్చీ పోయే కొంప. రాబడి రెండు వందలు వస్తే ఖర్చు మూడు వందలు దాటుతోంది. భూములమీద వచ్చే కొద్దిపాటి ఆదాయం సహాయంతో కాలక్షేపం చేస్తున్నారు.

'జీతం వేరు, కరువుబత్తెం వేరు అనకుండా జీతంతో కరువుబత్తెం కలిపివెయ్యా'మని కొంతకాలంగా గవర్నమెంటు వుద్యోగులు ఆందోళన చేస్తున్నారు. ఆ విధంగా ప్రభుత్వం చేస్తుందని ఆశించారు. కాని, యెన్నాళ్ళకీ నెరవేరేటట్టు కనబడక పోవడంవల్ల అందరికీ నిస్పృహగా వుంది. 'ఎన్నాళ్లు నౌఖరీ చేసినా యింతే. మన కష్ట సుఖాలు వాళ్ళ కక్కర్లేదు. ఇదివరకు విదేశీయులు పాలకులు గనుక ఏమీ చెయ్యలేదనుకున్నాం. ఇప్పుడు మనవాళ్లు చేసిన నిర్వాహకమేమిటి?' అని అనుకున్నారంతా.

"అచ్ఛా, అచ్ఛా. ఎంత రిబ్బనో నాకు" అంటూ అరుస్తూ గంతులేస్తోంది చిన్నపిల్ల రమ.

అప్పుడే ఆఫీసునుండివచ్చిన రమణారావు పెరట్లో కాళ్లు కడుక్కుని లోపలికి వస్తూ 'అమ్మాయీ దా' అని పిలిచాడు రమని. ఆ అమ్మాయికి రిబ్బనుసరదాలో తండ్రిపిలుపే వినబడలేదు 'ఎంతరిబ్బనో నాకు' అంటూ గెంతుతోంది యెప్పట్లా.

'రిబ్బనేమిటమ్మా? యెందుకలా గెంతుతున్నావ్' అన్నాడు రమణారావు పిల్ల చెయ్యిపట్టుకుని నవ్వుతూ.

అడిగిందే తడవుగా 'నాన్నోయ్ మరేం మనబల్లమీదేం యింత రిబ్బనుండ వుంది'

శ్రీమతి వేదుల మీనాక్షీదేవి

అంటూ కళ్లు పెద్దవిచేసి రెండు చేతులతో పుస్తకాలంత సైజు చూపిస్తూ.

'ఏదీ' అన్నాడు తండ్రి.

'చూపిత్తాను పదండి' అంటూ పెసరకాయల్లాంటి తనచేతి వేళ్ళతో వాళ్ళ నాన్న చెయ్యిపట్టుకుని లాక్కుని పోయింది సావిట్లో బల్లదగ్గరకి.

బల్లచుట్టూవున్న పిల్లల్ని, భార్యని చూసి 'ఇదేం? అంతా యిక్కడ చేరారెందుకమ్మా?' అన్నాడు రమణారావు.

'ఏంలేదు. ఈ రిబ్బను వుండని చూసి అందరం దాన్ని యెల్లావుపయోగించుకోవా అని చూస్తున్నాం' అంది కమలాభాయి.

'ఎవరికీ పనికిరాని ముక్కలుగా కత్తిరించి పారెయ్యకుండా ముందుగా చెప్పారు నయమే. మీ రెవరికోసం కొనలేదిది. ఇంటి ఖర్చు నానాటికీ యెక్కువై పోతోంది. హెచ్చడమే కాని తగ్గే లక్షణాలుకూడా కనబడ్డంలేదు. అందుచేత ఒక్కొక్క ఖర్చుకొక ఫైలు చొప్పున పెట్టి కుటుంబపు ఖర్చులు కొంత అదుపులోకి తేవాలనుకుంటున్నాను. నేను తయారుచేయబోయే ఫైళ్ళు కట్టుకుందుకు యీ రెడ్ టేప్ తెచ్చుకున్నాను-బాగుంటుందని" అన్నాడు రమణారావు.

'అదా సంగతి! అలాంటి వుద్దేశమే మీకుంటే ఆపనిలో ప్రధాన మంత్రి పదవి నేను నిర్వహిస్తాను" అంటూ చక్కాబోయింది లోపలికి కమలాభాయి.

'నేను విదేశాంగశాఖ నిర్వహిస్తాను నాన్నా' అన్నాడు పెద్దపిల్లాడు హనుమంతరావు.

'తప్పకుండా అలాచెయ్యి నాయనా, ఏనాడూ యిల్లు పట్టకుండా తిరుగుతూంటావు గనక విదేశాంగశాఖ నిర్వహించడానికి నువ్వే తగుదువు' అన్నాడు హేళనగా తండ్రి.

*　　　*　　　*

సాయంత్రం ఆరు గంటలైంది. రమణారావు షికారు వెళ్ళాడు. పిల్లల భోజనాలయాయి. వాళ్లందరినీ దగ్గిర కూర్చోపెట్టుకుని 'మీకో విషయం చెప్పాలనుకుంటున్నాను. మీ నాన్నగారొక్కరు మనందరి పోషణకోసం కష్టపడుతున్నారు. ఆ రోజు కారోజు ఖర్చు పెరిగిపోతోంది యింట్లో. అందుచేత మనమంతా కలిసి మీ నాన్నగారికి బాధ లేకుండా సంసారపు


మోసపోకండి! కొనవద్దు!

పోగొట్టుకోనవద్దు!
ప్రతిది 3సం॥లు గ్యారంటి
మేలైన అసలు స్విస్ 9¾ చిన్నసైజు తగ్గింపుధరలలో కొనండి.
501 క్రోమ్ 15 జ్యూ. రు 32/-
502 వాటర్ & షాక్ ప్రూఫ్, ఆంటీ మాగ్నెటిక్ క్రోమ్ స్టెయిన్‌లెస్ స్టీల్ బ్యాక్ 15 జ్యూ. రు 45/-
పోస్టేజి రు 1/- అధనం
రెండు గడియారాలకు ఉచితం.
ఉచిత కేటలాగుకు వ్రాయండి
LEVER WATCH Co.
Post Box No 2669. Calcutta-1.

మితవ్యయం

ఖర్చులు తగ్గించాలి సాధ్యమైనంతమట్టుకు. ఔనా? కాదా? చెప్పండి' అంది తల్లి.

'ఔను. తప్పకుండా అలా చెయ్యాలి' అన్నారంతా యేకగ్రీవంగా.

'మహామహా వాళ్ళలాగ కబుర్లతో సరి పెట్టకూడదు 'అల్లాగే చేద్దాం' అని. 'పని చేసి చూపించాలి' అంది తల్లి.

'నువ్వేం చెయ్యమంటే అది చెయ్యడానికి మేం సిద్ధంగా వున్నాం' అన్నాడు హనుమంతరావు తమ్ముళ్ళ తరఫునా, చెల్లెళ్ళ తరఫునా కూడా నాయకత్వం వహించి.

'మనమంతా ఒక కమిటీక్రింద యేర్పడి ఖర్చులు యేవిధంగా తగ్గించాలో ఆలోచించాలి.' అంది తల్లి.

కొంతసేపు అంతా ఆలోచనా నిమగ్నులయారు. ఆఖరిపిల్లాడు, పిల్లమాత్రం యిదేదో అయోమయంగా వుందికాబోలు కబుర్లు చెప్పుకుంటున్నారు కొత్త అవతలకి జరిగి.

'మనం తగ్గించవలసిన ఖర్చులలో మొదటిది. వారం వారం మనకు వెన్నకాచిన నెయ్యి తెచ్చేమనిషిని మానిపించేద్దాం. బజారు సేరికి దీనికి రూపాయి తేడావుంటుంది వీశకి. ఆ లెక్కని మనం పోయించుకునే సేరికి మూడుపావలాలు యెక్కువ అవుతోంది వారానికి" అన్నాడు పెద్దవాడు.

'నిజమే' అన్నారంతా.

'ఇక రెండవది. పాలు కాఫీకి మాత్రమే కాకుండా పెరుగుకోసంకూడా కొంటున్నాం. పెరుగుకోసం కొనే పాలు మానేసి గొల్లపెరుగు పుచ్చుకుందాం. రోజుకి అర్ధరూపాయి ఖర్చు తగ్గుతుంది' అంది తల్లి.

అంతా సమ్మతించారు.

'రెండుపూటలా కూరలు వండుకుంటున్నాం. ఇకముందు ఒక్కపూటే కూర. రెండోపూట పచ్చడిచేసుకుందాం. ప్రొద్దున్న పప్పు, పులుసుగాని, పప్పు, కూర, చారుగాని చాలు. పప్పు, పులుసు కాచిననాడు కూర, పచ్చడి రాత్రి చేసుకోవచ్చు. ఈ పద్ధతి మీకు నచ్చిందా?' అంది తల్లి.

'ఓ. నచ్చింది' అన్నారంతా.

'తరుచు ఫలహారాలు చెయ్యవద్దు. మాకూ, నాన్నకీ ఆదివారం శెలవు కనుక ఆనాడే ఫలహారం చెయ్యాలి. మిగిలిన రోజులలో అక్కర్లేదు' అంది పెద్దపిల్ల.

'ఆ ఫలహారమైనా రాత్రిభోజనాలవేళ చేస్తే ఇక ఆపూట భోజనం అవసరం వుండదు. ఆవిధంగా కొంత లాభం కూడాను.' అని ఒక సవరణ ప్రతిపాదించాడు చిన్నవాడు మధుసూదనుడు.

'అల్లావద్దు. మజ్జాన్నమే చెయ్యాలి' అంది రమ ఆటల్లోనూ, మాటల్లోనూవున్నా భోజనం, ఫలహారం మాటలు చెవిని పడగానే వాళ్ళదగ్గిరకి వచ్చి.

'నేనన్నమాట కాదంటావా?' అని చెల్లెల్ని గద్దించాడు. తనవాదనని ఖండించిందనే కోపంతో.

ఇంతలో తల్లి కలుగజేసుకుని "మధూ, మనం అంతా యిక్కడ చేరింది ఫూర్ టాక్స్ పేయర్‌కి ఖర్చు తగ్గించడానికి. మనం మితం వ్యయం కమిటీ మెంబర్లం అన్నమాట. మనం ఒకరితో ఒకరం తగూలాడుకోకూడదు. దుర్భాష లాడకూడదు. ఒకరు చెప్పిన విషయాన్ని గురించి అనేకులనేక రకాలుగా విమర్శిస్తారు. ఆ విమర్శించేవారిలో మంచిదనేవారూ వుంటారు, చెడ్డదనేవారూ వుంటారు. మంచి దన్నారని ఆనందం గాని, చెడ్డదన్నారని కోపం గాని అవసరం లేదు. మనం చెప్పదలచుకున్న విషయాన్ని సంకోచం లేకుండా చెప్పాలి. ప్రతీవారికీ వారివారి స్వంత అభిప్రాయాలు స్వేచ్ఛగా తెలియజేసేందుకు మన రాజ్యాంగరీత్యా హక్కు వుంది. నువ్వన్న మాట కాదందని చెల్లాయిని కసరకూడదు. పోనీ, మీ అందరి అభిప్రాయం తెలుసుకుంటాను. నేను ఒకటి అడుగుతాను. నచ్చినవాళ్లు చేతులెత్తండి: 'మధ్యాహ్నం ఫలహారం అక్కర్లేని వాళ్లెవరు?' అంది.

పెద్దవాడు, రెండోవాడు, పెద్దపిల్ల చేతులెత్తారు. అరటిచెట్ల ఆటలోలాగ వాళ్లు చేతులెత్తడం చూసి కుర్రాడు శ్రీనివాసు మెల్లిగా తనూ చేతులెత్తాడు.

చిన్నపిల్ల రమ ఒక్కత్తే యెత్తలేదు చెయ్యి.

'అంటే రాత్రి ఫలహారం కావాలనే వాళ్లు నలుగురన్నమాట. వద్దనే వాళ్లు ఒకే ఒకరు (ఆ ఒక్కరూ రమ.) కాబట్టి ప్రతి ఆదివారం రాత్రి భోజనాలవేళ ఫలహారం యివ్వడానికి యేర్పాటు చేశాము' అంది తల్లి.

'నాకు ఒక్కదానికీ మజ్జాన్నం చేస్తే సరి' అంది రమ.

'పొడుకాఫీ మానేద్దాం. పొడుం పౌను 3½ రూపాయ లైపోయింది కూడాను' అన్నాడు రెండోవాడు.

'అలా చేద్దాం' అన్నారు పిల్లలంతా.

'మనం మానేద్దాం. కాని మీ నాన్నగారికి ఓపూట యివ్వక తప్పదు. రెండోమాటు యెల్లాగా యింట్లో తాగరు ఆఫీసులోనే గాని. రమ పొద్దున్న పాలు కాసినితాగాలి. అందుచేత ఓ సోలెడు పాలు కొంటే సరిపోతుంది' అంది తల్లి.

పిల్లలు సమ్మతించారు.

'అమ్మా, సబ్బుబిళ్ళ కొంటే పదిరోజులైనా రావడంలేదు. అందుచేత సబ్బు మానేసి సున్నిపిండితోనో, కుంకుడుకాయలతోనో రుద్దుకుందాం' అంది పెద్దపిల్ల.

'సరే' అన్నారు కమిటీవారు.

మితవ్యయం కమిటీవారీ క్రిందివిధంగా ఖర్చు తగ్గించడానికేర్పాటు చేశారు.

1. నెయ్యివల్ల వారానికి మూడు పావలాల చొప్పున నెలకి 3 రూపాయలు. సంవత్సరానికి 36 రూపాయలు.

2. పాలవల్ల రోజుకి ½ రూపాయి చొప్పున నెలకి 15 రూపాయలు. సంవత్సరానికి 180 రూపాయలు.

3. కాఫీ మానడంవల్ల వారానికి 2 రూపాయల చొప్పున నెలకి 8 రూపాయలు. సంవత్సరానికి 96 రూపాయలు.

4. కూరలవల్ల వారానికి 2½ రూపాయల చొప్పున నెలకి 10 రూపాయలు. సంవత్సరానికి 120 రూపాయలు.

5. సబ్బులు మానడంవల్ల నెలకి 1½

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిశ్శక్తి, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.

పి. సి. ఏ. &కంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిడేపి- నెల్లూరు జిల్లా.

కుష్ఠు ★ బొల్లి

ఎగ్జిమా మేహపుమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటీ చికిత్స, కోర్టుగా ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ గోదావరి.

రూపాయిల చొప్పున సంవత్సరానికి 18 రూపాయలు.

మొత్తం సంవత్సరానికి తగ్గింపబడిన ఖర్చు—450.

* * *

'నెయ్యి వాసనగా వుంది' అన్నాడు హనుమంతరావు.

'నాకు వెయ్యకు' అని ముట్టిఅన్నమే తిన్నాడు మధు. మిగిలినవాళ్లు ఒక్కొక్క బొట్టు వేయించుకున్నారు. చిన్నపిల్ల రమమాత్రం యధాప్రకారంగా పేచీపెట్టి చాలా నెయ్యివేయించుకుని పిసికి పారేసింది మింగుడుపడక.

'మజ్జిగ నాలుక చిల్లుపడేట్టుంది' అంది పెద్దపిల్ల.

'వాసనకూడాను' అన్నాడు రెండోవాడు. గ్లాసులో మజ్జిగపోయించుకుని కాస్త వుప్పుకలుపుకొని త్రాగేశాడు. అంతా అతన్ని అనుకరించారు.

రాత్రి పచ్చడీ మెతుకులేకాకుండా వాసన నెయ్యి, గొల్లమజ్జిగతో పాపం పిల్లలు తినలేకపోయారు. ఎలాగో ముగించుకుని యివతలపడ్డారు. పనులన్నీ చేసుకొని తల్లివచ్చి కూర్చుంది. పెద్దపిల్లలు ముగ్గురూ దగ్గరచేరారు. ఆ కబురూ యీ కబురూ చెప్పినట్టే చెప్పి 'అమ్మా, మనం వేసుకున్న పద్ధతి అంత బాగా లేదు. మరో పద్ధతిగా చేసుకుందాం' అన్నారు.

'ఏమిటాపద్ధతి' అంది తల్లి.

'వెనకటి నెలమనిషి దగ్గరే నెయ్యి పుచ్చుకుందాం. యెటొచ్చీ వెనక కొనేటంత కాకుండా అందులో సగంమాత్రమే పుచ్చుకుందాం' అన్నాడు పెద్దవాడు.

'పాలు ఒక్కసేరుపుచ్చుకొని మజ్జిగ చేసుకుని పోసుకుందాం. గొల్లమజ్జిగ పోసుకోలేం బాబూ' అంది పెద్దపిల్ల.

ఇంతలో రెండోవాడు అందుకుని 'అమ్మా రెండుపూట్లూ కూరవుంటేకాని తినలేను. ఇదివరకంతంత కాకుండా కొంచెం కొంచెం వండు' అన్నాడు.

'కాఫీ లేక తలనొప్పివచ్చింది. ఒక్కపూట తాగుదాం' అంది తల్లి.

సబ్బులేక మొహం జిడ్డుగా వుంటోంది. నెలకి ఒక్క సబ్బు జాగర్తగా వాడుకుందాం' అంది పెద్దపిల్ల.

'ఇదివరకు కమిటీవారు తగ్గించుటకేర్పాటుచేసింది 450 రూపాయలు. కొత్త పద్ధతివల్ల సాలుకు 225 రూపాయలు తగ్గుతాయన్నమాట' అంది తల్లి.

'రైటే' అన్నారు మితవ్యయం కమిటీవారు.

'ఇంతవరకు బాగానే వుంది. గాని, మనం డబ్బు సంపాదించే సాధనాలు ఆలోచించాలి. చిల్లరబాకీలు తీర్చెయ్యాలి ముందు' అంది తల్లి.

'బుచ్చెయ్యగారిని బదులడిగితే సరి' అన్నాడు రెండోవాడు.

'వాడు అప్పుయిచ్చాడంటే మర్నాడు మన పెరటిగోడకి గుమ్మం కొట్టించి మన నూతిలో నీళ్లు తోడ్డం ప్రారంభిస్తాడు. వాళ్లకి నుయ్యి లేదు. మనం నోరెత్తడానికి వీల్లేదు. అప్పిచ్చాడాయె' అంది తల్లి.

'నిజమే' అన్నారు పిల్లలు.

'మన పొరుగు నరసింహంగారిని అడిగితేనో' అంది పెద్దపిల్ల.

'పెద్దవిశాలభావాలూ అవీ వున్నాయనీ పెద్దమనిషనీ పేరేగాని ఆయనకున్న సంకుచితభావాలెవ్వరికీ లేవు. అదీగాక ఆయన అయినవాళ్లకుపకారం చెయ్యడు' అంది తల్లి.

'అల్లాగా!' అని ఆశ్చర్యపోయారు పిల్లలు.

'పోనీ రామయ్యగారినడుగుదాం' అన్నాడు రెండోవాడు.

'ఆయనదగ్గర పుచ్చుకోవడంకంటె వుంటేతిని, లేకపోతే పస్తుపడుకోడం మంచిది. ఆయన అప్పుయిచ్చాడంటే వాళ్ల కొంప అమ్మిద్దామనే వుద్దేశంతోనే. గుండెల్లేని మనిషి' అంది తల్లి.

'అబ్బా, అంత దుర్మార్గుడా!' అని చీదరించుకున్నారు పిల్లలాయన్ని.

'పోనీగానీ లంచాలు పడితేనో" అన్నాడు పెద్దవాడు.

'తప్పు, తప్పు' అంది తల్లి.

'తమ్ముడి పాతపత్రిక లమ్మేసి కొత్తవి కొనకపోతేసరి' అంది పెద్దపిల్ల తమ్ముడు శ్రీనివాసు నుద్దేశించి.

ఆ అబ్బాయి కొనని పిల్లల పత్రిక లేదు.

'అక్కకి రిబ్బన్లు, పువ్వులు, గాజులు రంగు దారాలు కొనకపోతేసరి' అన్నాడు అక్కగారి మీద - తనకు పత్రికలు కొనవద్దందని కోపంతో శ్రీనివాసు.

'నాన్న ఫైల్సు తయారుచెయ్యడం మానేస్తే కొంత సొమ్ము మిగులుతుంది' అన్నాడు రెండోవాడు.

'నాన్న తెచ్చిన రిబ్బనుండ అమ్మేత్తేనో' అంది రమ. ★

తిక్క చావు

(13-వ పేజీ తరువాయి)

నటిస్తే నాకు మామగారు డబ్బు యివ్వకపోవడంవల్ల బెంగతో చచ్చిపోతున్నానని అందరూ ఆయన్ని చీవాట్లు పెడతారనుకున్నాను గాని, డాక్టరు వచ్చి యిల్లా చావగొడతాడనుకోలేదు' అన్నాడు రమణయ్య వెర్రిమొగంపెట్టి. 'తేలుకుడితే దవడమీద కొట్టి కొంతమంది మంత్రం వేస్తారు చూశావూ, అల్లాగే డాక్టరుగారు కూడ ఒక్క దవడ దెబ్బతో నీ చావుకు మంత్రంవేశారు బావా!' అంటూ గౌరీనాథంగారి అబ్బాయి రమణయ్యను వేళాకోళం చేశాడు. ★

రాజూ - పేదా
వెల రూ 2-0-0
తపాలాఖర్చు ప్రత్యేకము
ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-1



విజయవాడ బ్రాంచి: 16/46, నాగేశ్వరరావు పంతులురోడ్డు, సత్యనారాయణపురము
మా అపూర్వమైన ఔషధముల జాబితాలకు వ్రాయండి.